క్లుప్తంగా

జాగ్రత్తలు పాటించాలి

రేగిడి: వేసవి ఎండల నేపథ్యంలో అనారోగ్యం బారినపడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు సూచించారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు ఎండలలో తిరగవద్దన్నారు. చిన్నారులతో ప్రయాణాలు చేసేటప్పుడు వారికి ఎండ తగలకుండా చూసుకోవాలన్నారు. ఎండల వేడికి శరీరంలోని నీరంతా చెమట రూపంలో బయటకు పోతుందని, అటువంటప్పుడు నిమ్మరసం, ఫ్లూయిడ్స్ తాగాలన్నారు. డయేరియా బారినపడితే తక్షణమే ఆశ కార్యకర్తకు సమాచారం ఇవ్వాలన్నారు.

భూ ఆధార్ నమోదు ఆపండి

మెంటాడ: గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న భూ ఆధార్ నమోదు ప్రక్రియను ఆపాలని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాకోటి రాములు, తోత్తడి పైడినాయుడు ఓ ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. కేవలం జిరా యితీ భూములు కలిగి ఉన్న రైతుల వివరాల ను మాత్రమే ప్రభుత్వం నమోదు చేస్తోందని, దీంతో డీ-పట్టా భూములు సాగు చేస్తున్న కౌలురైతులు, అటవీ భూములు సాగు చేస్తున్న గిరిజనులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై ప్రభుత్వ స్పష్టత ఇచ్చిన తర్వా తే భూ ఆధార్ కొనసాగించాలని, అంతవరకు ప్రక్రియను నిలుపుదల చేయాలని ఆయన కోరారు.

గ్రామదేవతల పండగ

బాడంగి: మండల కేంద్రంలో పరదేశమ్మ, పోలమ్మ గ్రామదేవతల పండగ సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో తొలిరోజు ఉయ్యాల కంబాల ఉత్సవం, మరుసటి రోజు తొలేళ్ల సంబరం, ఆ తర్వాతి రోజు అనుపోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అభినందనలు



టిఫిన్ సెంటర్‌లో అరటి ఆకుల వినియోగాన్ని మెచ్చుకుంటున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: మున్సిపాలిటీ పరిధిలో పాలిథిన్, ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తున్న పలువురు దుకాణాదారులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ ప్రత్యేకంగా పువ్వులు ఇచ్చి మరీ అభినందించారు. పాత బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ టిఫిన్స్ సెంటర్‌ను ఆయన ఆదివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పాలిథిన్ సంచులకు బదులు అరటి ఆకులు వినియోగించడాన్ని చూసి, సెంటర్ యజమానులను అభినందించారు.

శ్రీవారికి స్నపన తిరుమంజన సేవ



శ్రీవారికి పూజలు చేస్తున్న అర్చకులు

సంతకవిటి: మండలంలోని మిర్తివలస గ్రామంలో శ్రీసంపత్ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గ్రామదేవతలకు పసుపు, కుంకుమలతో పూజలు చేయగా, శ్రీవారికి, అమ్మవార్ల ధ్రువమూర్తులకు స్నపన తిరుమంజన సేవ చేపట్టారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎంపీపీ శంబంగి లక్ష్మి దంపతులు

బొబ్బిలిరూరల్: మండలంలోని జగన్నాథపురం పంచాయతీ పరిధిలోని యుద్ధ స్తంభం వద్ద ఉన్న వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బొద్దల పద్మ, సత్యనారాయణ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీపీ శంబంగి లక్ష్మి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీ హాజరై, గణేశునికి పూజలు చేశారు.

రూ.2.5 లక్షలతో సీసీ కాలువ నిర్మాణం



కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏఈ వెంకట్

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని హరిజన వీధిలో రూ.2.50 లక్షల నిధులతో సీసీ కాలువ నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులను మున్సిపల్ ఏఈ వెంకట్ ఆదివారం పరిశీలించి, నాణ్యతపై ఆరాతీశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, కాలువల నిర్మాణం జరిగిన తర్వాత సీసీ రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. ఈ పనులన్నీ 15వ ఆర్థిక సంఘం నిధులతో చేయిస్తున్నామన్నారు.

పచ్చిరొట్ట సాగు..
భూసారం బాగు!



మామిడిపల్లి దగ్గరలో సాగు చేస్తున్న పచ్చిరొట్ట

- పచ్చిరొట్ట ఎరువుతో సాగు సుభిక్షం
- వేసవిలో సాగుకు రైతులు సమాయత్తం
- నెల రోజుల్లో కోత దశకు పంట
- విత్తనాల తయారీకి అన్నదాతల ఆసక్తి

రాజాం:

రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. నూతన వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ మార్కెట్‌లో మంచి లాభాలు తెచ్చిపెట్టే పంటల సాగుపై ఎక్కువగా దృష్టిసారిస్తున్నారు. ప్రస్తుతం రసాయనిక ఎరువులకు బాగా డిమాండ్ ఉండడంతో పాటు వాటి ధరలు కూడా అధికంగా ఉండడంతో పచ్చిరొట్ట ఎరువుల వినియోగానికి రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ఇచ్చే విత్తనాలపై ఆధారపడడం కన్నా సొంతంగా విత్తనాలు తయారు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. అవే విత్తనాలను ఇతర రైతులకు విక్రయించి, ఆదాయం పొందేందుకు గత రెండేళ్లుగా కృషి చేస్తున్నారు. వేసవిలోనే పచ్చిరొట్ట పంటను పండిస్తూ అటు భూసారం పెంచుకోవడంతో పాటు ఇటు ఆ విత్తనాలు అమ్ముతూ అదనపు ఆదాయం సంపాదిస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువు వాడితే నేల సారవంతమై పంటలు కూడా బాగా పండుతాయన్న ఉద్దేశంతో రైతులు కూడా పచ్చిరొట్ట సాగుకు ముందుకు వస్తూనే వాటి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది రాజాం నియోజకవర్గంలో రాజాంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో పచ్చిరొట్ట సాగు అధికంగా కనిపిస్తోంది. మొత్తం 1680 ఎకరాల్లో ఈ పంట సాగులో ఉంది.

ప్రయోజనాలెన్నో..

భూమి కోల్పోయిన పోషకాలను సహజ పద్ధతిలో పునరుద్ధరించేందుకు ఉత్తమమైన మార్గం పచ్చిరొట్ట పంటల సాగు. నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట పంటలైన కట్టిజనుమ, జీలుగ, పిల్లిపెసర సాగు చేసి భూములను సారవంతంగా మార్చుకోవచ్చు. పూత దశలో ఉన్న పచ్చిరొట్ట పంటను ఖరీఫ్‌లో దుక్కికి ముందు పొలంలో కలియదున్న డం వల్ల అవి కుళ్లి నత్రజని తదితర పోషకాలను అత్యధిక పరిమాణాల్లో నేలకు అందిస్తాయి. పశు వుల పేడ కన్నా పచ్చిరొట్ట పైరులు పది రెట్లు అధికంగా నేలను సారవంతం చేస్తాయి. తద్వారా కృతి మంగా నత్రజని, భాస్వరం వాడకం తగ్గించుకుని, నాణ్యమైన పంట దిగుబడిని పొందవచ్చు. భూమి లో కూడా నీటిని, పోషకాలను నిలుపుకునే సామ ర్థ్యం పెరుగుతుంది. నేలలో కలియదున్నిన పచ్చిరొట్ట పంట కుళ్లిన తర్వాత విడుదల చేసే భాస్వరం, పొటాష్‌తో పాటు గాలిలోని నత్రజని నేలలో స్థిరీకరింపబడతాయి. దాంతో నేలసారం బాగా పెరుగుతుంది. తద్వారా సూక్ష్మపోషకాలు మొక్కలకు అందుతాయి. సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి మొక్కల వేర్లు అభివృద్ధి చెందుతాయి. ఈ నేపథ్యంలో రైతులంతా ప్రధాన పంటలు వేసుకోవడానికి ముందు పొలాల్లో పచ్చిరొట్ట పంటల సాగుకు మక్కువ కనబరుస్తున్నారు. రసాయనిక ఎరువుల కొరతను అధిగమిస్తున్నారు.

పంట పేరు	విత్తన మోతాదు ఎకరాకు(కేజీల్లో)	దిగుబడి
కట్టిజనుము	16-20	300 కిలోలు
జీలుగ	12-16	280 నుంచి 350 కిలోలు
పిల్లిపెసర	5-6	3 నుంచి 4 క్వింటాళ్లు



సోపేరు సమీపంలో జీలుగు పంట సాగు

50 శాతం రాయితీపై విత్తనాలు..

ప్రస్తుతం 50 శాతం రాయితీతో ఈ పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు వ్యవసాయ శాఖ అందిస్తోంది. పది కిలోల విత్తనాల చొప్పున రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించగా, చాలా ప్రాంతాల్లో వేసవి పంటగా పచ్చిరొట్టను వేసి, విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. ఖరీఫ్‌లో వీటి విత్తనాలను ఇతర రైతులకు విక్రయిస్తారు. పది కిలోల విత్తనాలు రూ.500 ధర పలుకుతుండగా, 25 నుంచి 30 రోజుల వ్యవధిలో ఈ పంట పూత దశకు రావడంతో పాటు ఎకరా సాగులో 300 కిలోల పంట దిగుబడి వస్తుంది. రైతులకు పెట్టుబడి లేని ఈ పంట వల్ల ఆదాయంతో పాటు పచ్చిరొట్ట ఎరువు సిద్ధం చేసుకునే అవకాశం లభిస్తుంది. ఎక్కువగా రైతులు కట్టిజనుమ పంటను విత్తనాల నిమిత్తం సాగు చేస్తున్నారు.

పచ్చిరొట్ట వినియోగం పెరిగింది..



పచ్చిరొట్ట పంటల సాగుతో వ్యవసాయ భూమి సారవంతంగా తయారవుతుంది. భూసారం పెరగడానికి ప్రధాన పంటకు ముందుగా రైతులు విధిగా పచ్చిరొట్ట సాగు చేయాలి. ప్రతికూల పరిస్థితులను పైరు తట్టుకుని నిలబడుతుంది. ఆరోగ్యకర ఉత్పత్తులు సాధించవచ్చు. నియోజకవర్గంలో పచ్చిరొట్ట ఎరువుల వినియోగం బాగా పెరిగింది. విత్తనాలు కూడా రైతులు సిద్ధం చేసుకుంటున్నారు.

-కె.చంద్రరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ, రాజాం

ప్రమాదకరంగా మలుపు



సంతకవిటి-రాజాం ప్రధాన రోడ్డులో తాలాడ-గుళ్లసీతారాంపురం మధ్య రైస్‌మిల్లుకు సమీపంలోని రోడ్డు మలుపు ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఈ ప్రదేశంలో రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్లపొదలు, అధికంగా ఉండే తాటిచెట్ల కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించవు. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి, కనీసం హెచ్చరిక బోర్డు అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

-సంతకవిటి

'ఆటో'.. ఇటో.. అయితే ప్రాణానికే ప్రమాదం!



పరిమితికి మించి ప్రయాణికులతో ఆటోల్లో ప్రయాణించడం ప్రమాదమని తెలిసినా జనం పట్టించుకోవడం లేదు. ఇంటికి త్వరగా వెళ్లిపోవాలన్న ఆలోచనతో అటు ప్రయాణికులు, ఎంతమంది ఎక్కితే అన్ని ఎక్కువ డబ్బులు వస్తాయన్న ఆశతో ఇటు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతూ నమ్ముకున్న కుటుంబాల్లో విషాదం నింపుతున్నారు. రేగిడి మండలం, ఉంగరాడ రోడ్డులో ఇలా ఆటోలో వెనక పలువురు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న దృశ్యం ఆదివారం తారసపడింది. ఆటో అదుపు తప్పి అటో.. ఇటో అయితే ఏంటి పరిస్థితి అని, ఈ ప్రయాణం ప్రమాదం కాదా అని పలువురు అంటున్నారు.

-రేగిడి

సాగునీరు అందించాలి



తోటపల్లి ప్రధాన కుడికాలువ ద్వారా తెర్లాం మండలంలోని సతివాడ గ్రామంతో పాటు మరో ఐదు గ్రామాలకు సాగునీరు అందివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆ పార్టీ నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర మండలంలోని సతివాడ గ్రామానికి ఆదివారం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఆక్రమణకు గురైన సాగునీటి కాలువను పరిశీలించి, గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామం మీదుగా తోటపల్లి కాలువ వెళ్తున్నా తమకు మాత్రం సాగునీరు అందడం లేదని రైతులు వాపోయారు. నెమలాం నుంచి వస్తున్న పిల్లకాలువను కొంతమంది ఆక్రమించుకోవడంతోనే సాగునీరు రావడం లేదన్నారు. గ్రామంలోని లింగయ్య చెరువుకు సాగునీరు అందిస్తే అక్కడి నుంచి మరో ఐదు గ్రామాల్లోని పంటపొలాలకు సాగునీరు సులభంగా అందించవచ్చన్నారు. స్పందించిన ఆయన.. ఇదే సమస్య పరిష్కారానికి ఈ నెల 20న తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని, రైతులంతా హాజరుకావాలని కోరారు.

-తెర్లాం

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



జగన్మోహనరావు, అచ్చెన్నాయుడులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. ఇటీవల పార్టీ మండల అధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన వావిలపల్లి జగన్మోహనరావు, టంకాల అచ్చెన్నాయుడులను మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఆదివారం కలిసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని, పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రాంతాల్లోని, అన్ని వర్గాల నాయకులకు పార్టీలో సముచిత స్థానం కేటాయిస్తున్నారన్నారు. గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు చేసే అక్రమాలను అడ్డుకోవాలన్నారు. ప్రస్తుతం మన పార్టీకి 40 శాతం ఓటు బ్యాంకు ఉందని, రానున్న ఎన్నికల్లో అది పెరిగే విధంగా పనిచేయాలన్నారు. తమకు పదవులు వచ్చేలా కృషి చేసిన ఎమ్మెల్సీ విక్రాంత్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లకు కృతజ్ఞతలని జగన్మోహనరావు, అచ్చెన్నాయుడులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లి పెంటన్నాయుడు, చుక్కా వెంకటినాయుడు, కరణం శ్రీనివాసరావు, వావిలపల్లి శశిభూషణరావు, లెంక రాంబాబు, పక్కి చంద్రశేఖర్, కిమిడి మురళీధర్, కిమిడి మధు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సందడి



మండపారాధనలో పాల్గొన్న భక్తులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామంలోని లక్ష్మీగణపతి విజయదుర్గ శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. లక్ష్మీపురంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. మండపారాధనలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేసి, దైవం పట్ల తమకున్న భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



బ్రీత్ ఎనలైజర్‌తో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ రవికిరణ్

రాజాం సిటీ: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ వై.రవికిరణ్ హెచ్చరించారు. మండలంలోని మొగిలివలస గ్రామం వద్ద పోలీసులు ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు మద్యం తాగినదీ లేనిదీ బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి చూశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు తనిఖీ చేసి, ఎటువంటి పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించడంతో పాటు పెండింగ్ చలాన్లను వసూలు చేశారు. ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లరాదని తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్‌ఐ పి.జనార్దనరావు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు



రామభద్రపురం: పరీక్ష ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో మోహనరావు

రామభద్రపురం: పకడ్బందీగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని డిప్యూటీ ఈవో కె.మోహనరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షల కోసం బొబ్బిలి నియోజకవర్గంలో 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిల్లో 4,812 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. రామభద్రపురం ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 270 మంది, గ్లోబల్ వ్యూ స్కూల్ పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. ప్రతి కేంద్రానికి చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించామన్నారు. ప్రతి కేంద్రం వద్ద పోలీసులతో 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.

బాడంగి: మండలంలోని బాడంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, రేజేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నట్లుఎంఈవోలు లక్ష్మణదొర, రాజేశ్వరిలు తెలిపారు.

రేగిడి: మండలంలోని సంకిలి, ఏవీపురం, రేగిడి, లక్ష్మీపురం పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిల్లో సోమవారం జరిగే పరీక్షలకు మొత్తం 534 మంది హాజరుకానున్నారని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు తెలిపారు.

రాజాంలో ఓపెన్ స్కూల్ పరీక్షలు..

రాజాం: మండలంలో మొత్తం 8 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. భాష్యం, శ్రీచైతన్య, ది సన్, వరలక్ష్మీ సెయింట్ ఆన్స్ స్కూల్స్‌తో పాటు డోలపేట, కంచరాం, సారథి జెడ్పీ ఉన్నత పాఠశాల, రాజాం గవర్నమెంట్ హైస్కూల్‌లో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. మొత్తం 1724 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని, తొలిరోజు విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. రాజాంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు జరగనున్నాయని రాజాం ఓపెన్ స్కూల్ విభాగం అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రెడ్డి రమణ ఆదివారం తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ఎం.సీతారాంపురం గ్రామస్తులకు సూచనలిస్తున్న సీఐ ఉపేంద్ర

వంగర: యువత, విద్యార్థులంతా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ హెచ్.ఉపేంద్ర సూచించారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎం.సీతారాంపురం గ్రామంలో ఆదివారం రాత్రి పర్యటించిన ఆయన.. గ్రామస్తులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయి.. వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులు, మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఎవరికీ ఓటీపీ చెప్పవద్దన్నారు. అలాగే గంజాయి, ఖైనీ, గుట్కా, సిగరెట్, మద్యం వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దన్నారు. అనంతరం రాత్రి అదే గ్రామంలో పల్లె నిద్ర చేశారు. ఆయన వెంట ఎస్‌ఐ షేక్‌శంకర్ తదితరులు ఉన్నారు.

మజ్జిగ పంపిణీ

రాజాం: మండలంలోని మొగిలివలస గ్రామ ఆర్‌అండ్‌బీ రహదారి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. రాజాం అమృత ఆస్పత్రి ఎండీ గార రవిప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ అందించినట్లు యువకులు తెలిపారు. కార్యక్రమంలో మజ్జి హరి, లెంక మధుసూదనరావు, పెనుమజ్జి శివ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులంతా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పోరాటం చేసిన యోధుడు, మహాత్మాగాంధీ సత్యం, అహింస, హరిజనోద్ధరణ వంటి ఉత్తమ ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన ఆదర్శప్రాయుడు, చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు అని వక్తలు కొనియాడారు.

-బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రాజాం సిటీ: రాజాంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మానవతా సేవా సంస్థ సభ్యులు



తెర్లాం శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి తదితరులు



బొబ్బిలిలోని బాలికల వసతిగృహంలో అమరజీవికి జోహార్లు చెబుతున్న సిబ్బంది, విద్యార్థులు



సంతకవిటి ఎంపీడీవో కార్యాలయంలో పొట్టి శ్రీరాముల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది



బొబ్బిలిరూరల్: బొబ్బిలి ఎంపీడీవో కార్యాలయంలో అమరజీవి జయంతి కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్ తదితరులు



బాడంగి శాఖా గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో పాల్గొన్న లైబ్రేరియన్, విద్యార్థులు, పాఠకులు